క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు సురక్షితం



గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న సీహెచ్‌వో సింహాచలం

కె.కోటపాడు: ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవాలు చేయించుకోవడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని చౌడువాడ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి సింహాచలం తెలిపారు. చౌడువాడ, గరుగుబిల్లి గ్రామాల్లో గర్భిణులకు శనివారం ఆమె ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఆకుకూరలు, పప్పు దినుసులు మనం తీసుకునే ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత బారిన పడే పరిస్థితి ఉండదని తెలిపారు. హెచ్‌వీ అచ్చియ్యమ్మ, ఏఎన్‌ఎం సన్యాసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కాళ్ల ఝాన్సీరాణి

నాతవరం: గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గణేష్ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని యం.బి.పట్నం సర్పంచ్ కాళ్ల ఝాన్సీరాణి తెలిపారు. ఈ మేరకు ఎ.శరభవరంలో డ్రైనేజీ కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎం.బి.పట్నంలో రూ.15 లక్షలతోనూ శివారు ఎ.శరభవరంలో రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పల్లి భవానీరాము, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి వెంకటరమణ పాల్గొన్నారు.

శకుంతలాదేవికి ఘన నివాళి



శకుంతలాదేవి గురించి వివరిస్తున్న హెచ్‌ఎం రాము

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత మేధావి శకుంతలాదేవి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శనివారం హ్యూమన్ కంప్యూటర్‌గా పేరు గాంచిన ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం కోసూరు రాము మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన లెక్కలను కంప్యూటర్ కంటే వేగంగా చేస్తూ హ్యూమన్ కంప్యూటర్‌గా ప్రసిద్ధి చెందారని వివరించారు. విద్యార్థులు కూడా లాజికల్ థింకింగ్, వేగం, కచ్చితత్వం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు నారాయణరావు, లోవరాజు పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



దువ్వాడలో బండా అప్పారావుకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న చీడికాడ మండలం ఖండివరం వలంటీరు దేముడునాయుడు
- మాడుగుల రూరల్



గాజువాక ఆస్పత్రిలో పేరమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న మాడుగుల మండలం జాలంపల్లి వలంటీర్ అప్పారావు
- మాడుగుల

కొండ‘బాట’ బాయె లచ్చమ్మదీ..



రావిపాలెం నుంచి రాచగొప్పూరు వరకు కొండబాట (ఫైల్)



రావిపాలెం నుంచి రాచగొప్పూరు వరకు రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

- రూ.8.60 కోట్లతో గిరి గ్రామాలకు పక్కారోడ్లు
- ఫలించిన 75 ఏళ్ల నాటి కల
- తప్పనున్న డోలీ మోతలు
- ఆనందంలో గిరిజనులు



కామకూటం నుంచి గొప్పూరుకు రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

మాడుగుల: పురిటి నొప్పులు వస్తే తప్పని డోలీ మోతలు.. కనీసం రేషన్ డోర్ డెలివరీ వాహనం వచ్చే వీలులేక ఎనిమిది కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి తీసుకోవాల్సిందే.. ఇక అటవీ ఉత్పత్తులు మైదాన ప్రాంతాలకు తరలించాలంటే ఆపసోపాలు పడాల్సిందే.. సరైన రవాణా వ్యవస్థ లేక ఇలా ఎన్నో రకాలుగా నలిగిపోతున్న గిరిజనుల కష్టాలకు త్వరలో మోక్షం కలగనుంది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో సిరిపురం, గొప్పూరు, కామకూటం కొండవీధి గిరిజన గ్రామాల్లోని కొండబాటలు పక్కా రోడ్లుగా మారుతున్నాయి.

జాలంపల్లి పంచాయతీ శివారు గిరి గ్రామాలు రావిపాలెం నుంచి సిరిపురం మీదుగా రాచ గొప్పూరు వరకు రూ.5.40 కోట్లు, కామ కూటం నుంచి కొండ వీధి గిరి గ్రామాలకు ఏఐబీ నుంచి రూ.3.20 కోట్లతో శరవేగంగా రోడ్లు నిర్మిస్తున్నారు. సిరిపురం గ్రామానికి కొండబాటలో నాలుగు కిలోమీటర్ల మేర రహదారి నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే పాడేరుకు సునాయాసంగా చేరుకుంటారు. జి. మాడుగుల గిరిరైతులు ఇకపై మాడుగుల వారపు సంతలకు తాము పండించే పంట ఉత్పత్తులు తరలించడానికి కష్టాలు తప్పనున్నాయి. వీరికి పాడేరు కంటే మాడుగుల దగ్గరవుతుంది. ఇప్పటికే మండలంలో ఎం. కోడూరు నుంచి మాడుగుల మీదుగా చీడికాడ మండలం ఖండివరం వరకు రూ.1.28 కోట్లతో పక్కా రోడ్డు నిర్మించారు. కింతలి వల్లాపురం పంచాయతీ పనుకు గడబవీధి వరకు రూ.85 లక్షలతో రోడ్డు, శరభన్నపాలెం నుంచి కాగిత మీదుగా పెద సారాడ వరకు రూ.1.85 కోట్లతో గిరిజన గ్రామాలకు వంతెనలతోపాటు రోడ్లు నిర్మిస్తున్నారు.

అష్టకష్టాలు పడేవాళ్లం



మా తాతల కాలం నుంచి రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వ పథకాలు అందుకోవాలంటే 8 కిలోమీటర్ల మేర అడవిలో నడిచి జాలంపల్లి వెళ్తున్నాం. 108, 104, వాహనాలు మా గ్రామాలకు రాలేవు. 75 ఏళ్ల పాలనలో ఎందరో నేతలు మారారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మా కష్టాలు గుర్తించి కొండబాటలను పక్కా రోడ్లుగా మార్పు చేస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– కొర్రా ఈశ్వరరావు, సిరిపురం, గిరిజనుడు

అభివృద్ధి చేసి చూపిస్తా



నియోజకవర్గంలో గిరిజన గ్రామాలతోపాటు మైదాన గ్రామాలకు పక్కా రోడ్లు ఇప్పటికే దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. గిరిజనుల కష్టాలు తెలుసు, 50 మంది జనాభా ఉన్న గిరి గ్రామాల్లోనూ పక్కా రోడ్డు వేస్తున్నాం. నాలుగున్నరేళ్లలో అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నాను. మోడల్ నియోజకవర్గంగా మార్పు చేయడానికి సమయం ఇవ్వండి. చేసి చూపిస్తా.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు



వంద మంది జనాభా ఉన్న మారుమూల గ్రామాలకు రోడ్డు వేసి మా కష్టాలు తప్పిస్తున్నారు. గతంలో పురిటి నొప్పులు వచ్చిన గర్భిణులను నాలుగు కిలోమీటర్ల మేర డోలీ కట్టి మోసుకెళ్లేవారం. ఏ పాటి కష్టమొచ్చినా నరక యాతన పడేవారం. ప్రస్తుతం రోడ్డు పనులు చేస్తుండటం చాలా ఆనందంగా ఉంది. డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతలు చెబుతున్నాం.

– చదల కృష్ణ, సిరిపురం, గిరిజనుడు

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులు



నియోజకవర్గంలో ఇప్పటికే ఏఐబీ నిధులు రూ.15.5 కోట్లతో రోడ్లు నిర్మించాం. తాజాగా 6 రోడ్లకు రూ15.20 కోట్లు మంజూరు కావడంతో పనులు చేస్తున్నాం. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేస్తాం.

– భరణీ కుమార్, ప్రాజెక్టు జేఈ

మరిడిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



మరిడిమాంబ ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: చిన అప్పనపాలెంలో మరిడిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇక్కడ గతంలో నిర్మించిన మరిడిమాంబ ఆలయం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు, మరిడిమాంబ ఉత్సవ కమిటీ సభ్యులంతా కలిసి దాని స్థానంలో కొత్తగా ఆలయం నిర్మించాలని తీర్మానించారు. ఈ మేరకు ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, గ్రామ నాయకులు కోవెల ఈశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మండల స్థాయి సుపథ ప్రతిభ పరీక్షలు నేడు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో సుపథ ప్రతిభ పరీక్షలను ఆదివారం నిర్వహించనున్నట్లు సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిల్లో పద్య, శ్లోక పఠనం, దేశ భక్తి గేయాలు, వ్యాస రచన, వేద పఠనం, శ్రీకృష్ణ చరితామృతం, శ్రీమద్రామాయణం, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 32 పాఠశాలల నుంచి 400 విద్యార్థులు పాల్గొంటారన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ, మాతృభాషపై మక్కువ కల్పించడంలో భాగంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎం. అలమండలో 61 మందికి వైద్య పరీక్షలు



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న అగనంపూడి క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు

దేవరాపల్లి: ఎం. అలమండలో శనివారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అగనంపూడిలోని హోమ్ బాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ప్రివెంటివ్ అంకాలజీ డిపార్టుమెంట్ వైద్యులు హర్షిత, తరుణ్ 61 మందిని పరీక్షించారు. ఓరల్, బ్రెస్ట్, సెర్వైకల్, పెనైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన అవగాహన కల్పించారు. ఈ శిబిరానికి వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి. హారిక, స్థానిక వైద్య సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. వీఆర్‌వో పోతల శంకరరావు, ఎంపీటీసీ పోతల వెంకటరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాదరావు, పాల సంఘం అధ్యక్షుడు పాలిపిరెడ్డి రమణ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై హర్షం

మాడుగుల రూరల్: రాష్ట్రంలో అక్రిడేటెడ్ జర్నలిస్టులకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాల కేటాయింపునకు రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంపై ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు ఏలూరు సురేష్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిష్కారానికి ఎన్నికల హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు. ఆయనకు రుణపడి ఉంటామని ఈ సందర్భంగా మాడుగుల ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు.

జె.బి.పురంలో పూరిల్లు దగ్ధం

రూ.1.20 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన పూరిల్లు

మాడుగుల రూరల్: చీడికాడ మండలం జె.బి.పురంలో శనివారం సాయంత్రం పూరిల్లు దగ్ధమైంది. రూ.1.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రాకోటి చిన్నమ్మలు పూరిల్లుకు మంటలు అంటుకోవడంతో చోడవరం అగ్నిమాపక అధికారి బి.వి.రామస్వామి, సిబ్బంది సారథ్యంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పి వేశారు. వీఆర్వో సన్యాసిరాజు ఆస్తి నష్టం వివరాలు సేకరించారు. బాధితురాలిని సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, పార్టీ నాయకులు ధర్మిశెట్టి కొండబాబు పరామర్శించారు.

ఆత్మీయ కలయిక.. వెల్లివిరిసిన ఆనందం



సమావేశమైన గొలుగొండ గురుకులం పూర్వ విద్యార్థులు

25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: గొలుగొండ మండలం ఏపీ బాలురు గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఇక్కడ 1995–96లో పదో తరగతి చదువుకున్న వీరంతా శనివారం నర్సీపట్నంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. 25 ఏళ్ల నాటి మధురానుభూతులను నెమరువేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలతోపాటు వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారంతా కలుసుకోవడంతో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి చిలిపిచేష్టలు గుర్తు చేసుకుంటూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘంగా ఏర్పడిన రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను గౌరవాధ్యక్షులు యాదిగిరి అన్నవరం, ఉప్పాటి అప్పారావు, అధ్యక్షులు తాటిపూడి గోవింద్, యాళ్ల కిశోర్, ట్రెజరర్ ఆరుగుల్ల నాగేశ్వరరావు సభలో వివరించారు. కష్టంలో ఉన్న మిత్రులకు చేయూతనందించేందుకు సంఘం ఏర్పడిందన్నారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు అండగా నిలుద్దామని తీర్మానించుకున్నారు. సంఘ కార్యకలాపాలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు అందరికీ జ్ఞాపికలు అందజేశారు.

సకాలంలో రుణాలు చెల్లిస్తే ప్రభుత్వ రాయితీ

ఏపీజీవీబీ మేనేజర్ శ్రావణ్‌బాబు



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌బాబు

కె.కోటపాడు: ఏపీజీవీబీ ఖాతాదారులకు తక్కువ ప్రీమియంతోనే బీమా కల్పిస్తున్నట్లు చౌడువాడ బ్రాంచ్ మేనేజర్ కె.శ్రావణ్‌బాబు తెలిపారు. ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా శనివారం బ్యాంక్ సేవలపై గొండుపాలెంలో గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎంజేజేబీవైలో 50 ఏళ్ల లోపు వారికి ఏడాదికి రూ.436 చెల్లించాలని తెలిపారు. వీరికి సహజ మరణం సంభవిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా అందించనున్నట్లు తెలిపారు. పీఎంఎస్‌బీవై కోసం 70 ఏళ్లలోపు వారు ఏడాదికి రూ.20 చెల్లించాలని తెలిపారు. ప్రమాద సమయాల్లో మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా అందిస్తామన్నారు. అటల్ పెన్షన్ యోజనలో 18 నుంచి 39 ఏళ్ల వయసు వారు ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని చెల్లిస్తే వారికి 60 ఏళ్ల వయసు దాటాక పెన్షన్ వస్తుందన్నారు. డ్వాక్రా, వ్యవసాయ రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. అనంతరం బ్యాంక్ సేవలపై కళాజాతా ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, బండారు లక్ష్మణరావు, సీఎస్‌పీ ఎ.రామలక్ష్మి పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహనకు జి.కె.టెస్ట్

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



పోటీ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే గణేష్, ఫౌండేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన పెంచేందుకు జి.కె.టెస్ట్ ఎంతో దోహదపడుతుందని స్టార్ ఫౌండేషన్ సభ్యుడు, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. స్టార్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టార్ జి.కె టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షలను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్ ఫౌండేషన్ సొసైటీ స్థాపించిన నాటి నుంచి విద్యతోపాటు అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీ పరీక్షలకు గ్రామీణ యువతను తీర్చిదిద్దే ఆలోచనతో మిత్రుడు, విశాఖ డీసీపీ కె.శ్రీనువాసరావు సూచన మేరకు ఫౌండేషన్ సభ్యులు ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు బాలల దినోత్సవం రోజున అందజేస్తామన్నారు. ఈ పోటీ పరీక్షలకు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఎస్.ఆర్.శర్మ, వి.నాగిరెడ్డి, ట్రెజరర్ పూడా రాము, జాయింట్ సెక్రటరీ లాలం రమేష్, జాయింట్ ట్రెజరర్ ఎం.శ్రీను పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ, ఓట్ల నమోదుపై దృష్టి పెట్టాలి

ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్



మాకవరపాలెం: బూరుగుపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: బీఎల్వోలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో జయరాం



రోలుగుంట: నిండుగొండలో బీఎల్వోకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ వరహాలు



మాడుగుల రూరల్: చీడికాడ మండలం తురువోలులో బీఎల్వోతో మాట్లాడుతున్న ఆర్వో మాధవి

మాకవరపాలెం: ఓటర్ల సవరణ, కొత్త ఓట్ల నమోదుపై బూత్ కన్వీనర్లు, నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సూచించారు. బూరుగుపాలెం, మాకవరపాలెంలో శనివారం బూత్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం చేర్పులు, మార్పులపై అవగాహన కల్పించారు. ప్రతి పోలింగ్ బూత్ కన్వీనర్‌తోనూ ఎమ్మెల్యే ప్రత్యేకంగా మాట్లాడారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, నాయకులు పెట్ల భద్రాచలం, బాలకృష్ణ, కాళ్ల త్రినాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

నర్సీపట్నం: ప్రత్యేక ఓటరు నమోదు శిబిరంలో భాగంగా ఆర్డీవో హెచ్‌ఎం.జయరాం శనివారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బీఎవోలు విధిగా పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. రాజకీయ నాయకుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులపై బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ అన్నాజీరావు, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు ఉన్నారు.

మాడుగుల రూరల్: ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాల్లో 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలని మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె. మాధవి తెలిపారు. శనివారం ఆమె మాడుగుల, చీడికాడ, మండలాల్లో పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎన్నికల సీనియర్ సహాయకుడు పి.పూర్ణయ్య, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో పోలింగు బూత్‌లను తహసీల్దార్ వరహాలు శనివారం పర్యవేక్షించారు. నిండుగొండ పీఎస్‌లో బీఎల్వో ప్రేమానందానికి పలు సూచనలు చేశారు.

కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

మాడుగుల: ఒమ్మలిలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శనివారం శంకుస్థాపన చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో ఇక్కడ దుర్గానగర్‌లో 25 కుటుంబాలు కలిసి రూ.6 లక్షల విరాళాలతో ఈ ఆలయం నిర్మించనున్నారు. వేద పండితుడు కోట వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ సుంకర సింహాచలంనాయుడు, ఎంపీటీసీ గూడెపు సత్యవతి, హరికృష్ణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొద్దాపు భాస్కరరావు, మాజీ సర్పంచ్ నందారపు సన్యాసిరావు, బొద్దాపు దేముడునాయుడు, జె.డి.పేట సర్పంచ్ కె. కృష్ణమూర్తి, ఉగ్గిన అప్పలనాయుడు, గొల్లవిల్లి విజయ కుమార్, పూసర్ల బుజ్జి, కాతా వెంకటరమణ, పడాల శ్రీను పాల్గొన్నారు.

గాయపడ్డ కూలీ మృతి

కశింకోట: తాళ్లపాలెం వద్ద ఈ నెల 1న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కూలీ విశాఖ కేజీహెచ్‌లో శనివారం మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణ రెడ్డి తెలిపారు. మాకవరపాలెం మండలం జి.కోడూరుకు చెందిన తోట అప్పారావు(42) మృతి చెందగా, కేసు నమోదు చేశామన్నారు.

వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షల అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీ ఐదో వార్డుకు చెందిన వలంటీర్ బోజా భానుప్రకాష్ కుటుంబానికి శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గణేష్ రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఇటీవల భానుప్రకాష్ విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. అతడి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుంచి ఈ మొత్తం మంజూరు చేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ నాయకుడు దాడి బుజ్జి పాల్గొన్నారు.